రోజా

టేకుమళ్ల కామేశ్వరరావు

***ఆ** రోజా (బళ్లదారి) న్ని ఎన్ని సార్లు బండీ తోలలేదు! పొట్టి ఎఱ్ఱెద్దుల బరువు బండీ కొండల మీంచి ఊడిన బండరాయిలాగ దొర్లి వచ్చేది. తను ఒక్కడే తోలుతున్నాడా!గూడెం దొరలందరూ వెదుళ్ల బళ్లు నిత్యమూ తోలుతూనే ఉంటారు. రోజా మంచిదని కాదు. రోజా మంచి దేమిటీ! మంచిదంటూకూడా ఉంటుందేమిటి! మన్నెంలో రోజాలంతే! వెల్లడి (సమతలం) బళ్లదారులా ఇవి! బొఱ్ఱన్న దొరకి తన ఎద్దుకాలుగాక తన కాలు విరిగిందనిపించింది. ఉపద్రవం కోపమూ, విచారమూ వేశాయి; ఎద్దు బాధకోసం విచారమూ, గొడ్లని కోసుకుతినేజాతి అయితేయేం; రోజా మీద కోపమూ. దొర ఎద్దు మెడ మీంచి కాడి ఎత్తడం మాట అటుంచి, ఏబండరాయి తగిలి ఎద్దు కాలు విరిగిందో ఆరాతిని కసిదీరా, కాలు దిమ్మెక్కేవరకూ తన్నేడు. “ ఉండు నీ పని చెప్తా” అని కోపం లోపల అణిచేసి చెయ్యిమట్టుకు ఆడించాడు. ఒక క్షణం యోచించగా దొరకి రోజా అంతాకూడా విచిత్రంగా కనపడింది.*

“ ఈ రోజాలో పుట్టింది లగాయతు ఇప్పటిదాకా కళ్లుమూసుకునే బండీతోలేనా, పిచ్చివాణ్ణయి బండీతోలేనా!” అని ఆశ్చర్య మొలకెత్తింది. “దొరలందరూ పిచ్చి వెధవలే! అబ్బా! ఇంతమందీ ఎంతబాధపెట్టి ఈడవలేని వెదుళ్ళబళ్ళని ఈడిపిస్తారు! కోయజాతికి తెలివితేటలు లేకపోవడమే కాకుండా గుండెకూడా లేదుకదా! జంతువుల్ని కోసుకుతినే జాతని నిజంగానే అనిపించుకుంది” అని బొఱ్ఱన్న దొర తనకికలిగిన నూతనదృష్టితో తన జాతినంతా విమర్శించి ఆశ్చర్యపోయి నిలుచుండిపోయాడు.

దొర శ్రమపడి దాపటెద్దు మెడతాడు విప్పి కాడి తప్పించాడు. ఎద్దు బాధపడుతూనే లేవలేక లేవలేక మూడుకాళ్ళమీద నిలుచుంది. ఎద్దుని చూస్తూన్న కొద్దీ దొరకి వెఱ్ఱి ఉద్రేకం పుడుతూంది. రోజా అంతా తలలో సినీమా ఫిల్ములాగ తిరిగిపోయింది. రాజవొమ్మంగిరోడ్డునుంచి రోజా మొదలెట్టింది మొదలు లాగరాయి వరకూ అతని కళ్ళముందర మంత్రశక్తి వల్ల వేరుముక్క నడిచినట్టు నడిచింది. మొదట ఒక మనిషికి సరిపోయిన దారిలాగ కనబడే ఆ రోజాలో బండీ నడిపించాలి. ఎడ్లతట్లని డొంకలు, కొమ్మలు గీసుకొంటూంటాయి. కొమ్మలు చక్రాల ఆకుల మధ్యపడి అడ్డుతాయి. సరేసరి, బండీకి గూడు ఉండ భయం. పక్కకొమ్మలు, పైకొమ్మలు వెదురుగూడుని చదరంతలేకుండా చేస్తాయి. నిరుడు గంగా దేవి జాతరకి దొర తన కూతుర్ని వాతంగినుంచి తీసుకొస్తున్నాడు. దారిలో కొంతదాకా వాన. వానలో కాస్తోకూస్తో తడిశారు. వాన వెలిసింది. పక్కకొమ్మలకి గూడు చిరిగిపోతూంది. గూడుకి పైకొమ్మలే తగలగా బండిలో కుండెడు నీళ్ళు దిమ్మరించినట్లు పడి వానలో కంటే ఎక్కువగా తడుస్తున్నారు. అదికూడా చాలక ఒక చింతకొమ్మ బండీలో దూరి గూడు గూడూ లేచిపోయింది. కూతుర్ని అరి చేతులమీద పెట్టుకుని తెద్దామనుకున్నాడు బొఱ్ఱన్నదొర. అప్పటి స్థితి చూసి ఒక క్షణం విచారమనిపించింది; కాని అంతకంటే అప్పుడు మరేమీ అనిపించలేదు. ఇప్పుడో! ఆ దృశ్యం తలపుకిరాగా ఒంటిని జెఱ్ఱులుపాకినట్లు గగుర్లు ప్రవహించాయి. గూడుని తన పొట్టని పెట్టుకొన్న చింతకొమ్మ ఇంకా అలాగే ఉంది. చూపు మేర దూరంలోనే ఉంది. తనవేపే చూస్తూంది. దొర బండీ అవతలవేపుకి వెళ్లాడు. బండీ తడికలో ఇరికించిన కత్తి పైకి లాగాడు. బయలుదేరాడు. చింతచెట్టు ఎక్కాడు. ఆ మొండి చింతకొమ్మని రెండు దెబ్బల్లో నేలమీద పడేశాడు. ఎంత పిచ్చికోపంతో కొట్టేడో ఏమిటో! అతను చెట్టుదిగి శాంతించి తిరిగి బండీ దగ్గరికి వచ్చాడు. రెండో ఎద్దుని కూడా విప్పాడు. ఎడ్లని నెమ్మదిగా ఇంటివేపు తోలేడు. కాలు విరిగిన ఎద్దుకోసం అక్కడక్కడ ఆగుతూ వీధికి (ఒకే కోయపల్లిలోని కొన్ని ఇళ్ల గుంపు) రెండు ఝాములికి వెళ్లాడు.

వీధిలో ఉన్న చుట్టాలంతా ఎద్దుని చూశారు. “ఓస్ ఇంతేఱ్ఱా” అన్నారు. బొఱ్ఱన్న[illegible]దొర కడుపులో ఉన్న సంగతి ఎవరికీ చెప్పలేదు. కోయదారాయె! కళ్లతోనేగాని నోటితో మాట్లాడతాడా! అందులో ఉద్రేకం మీద ఉన్నాడు. గూడెం దొరలంతా ఎదుని చంపి పంచేసుకున్నారు. ఆ సాయంత్రం మరో ఎద్దుని కూడా తోలుకువెళ్లి బండీ వెదురు ఏలేశ్వరంలో సాహుకారికి బొఱ్ఱన్నదొర అప్పచెప్పాడు. సాహుకారు “ఎప్పుడు మళ్లీ తోలుకొస్తావు?” అన్నాడు. “ఏమో!” అన్నాడు దొర ముక్తసరిగా. “అదేమి?” అన్నాడు శెట్టిగారు. “ఎద్దు కాలు విరిగిపోయింది” అన్నాడు దొర, కోయయాస తోటి. ఏయెద్దు, ఇదా, మరొకటా, ఎక్కడ, ఎంచేత, ఎప్పుడు అనే విషయాలు శెట్టి అడగాలేదు, దొర చెప్పాలేదు. సాహుకారు “మరొక దానితో తీసుకురా,’ అన్నాడు. దొర మాట్లాడలేదు. శెట్టిగారు అంతకంటే అడగలేదు. వాడే తెస్తాడని ఊరుకున్నాడు. వెదురు దింపేసి బొఱ్ఱన్నదొర సాయంత్రం గూడానికి బండి తోలుకుపోయాడు. బాపన్న దొర “అన్నా! వెదురికెప్పుడెళదాంరా?” అన్నాడు. “రాను” అన్నాడు బొఱ్ఱన్న దొర. “ఏంరా?” అని ప్రశ్నించాడు బాపన్న దొర. “చెప్పుతానులే” అన్నాడు దొర.

మన్నాడు పొద్దున్న బొఱ్ఱన్నదొర మచ్చుబుడప (బుడప లేక బొడప = చిన్న కొండ) అవతల ఉన్న తన చలకకి మామూలు ప్రకారం వెళ్లి గంటెలచేను ఏపుగా ఉండడం చూచి ఆనందపడ్డాడు. **ఇప్పుడున్న కొత్త యోచనల మీద చేను మధ్య ఉన్న మోళ్లు (వ్యవసాయం చెయ్యడం కోసమని అడివిని నరుకుతారు. చెట్లని మొదలంటా తెగకొట్టక [illegible]ము త్తు ముక్కలుంచేస్తారు. ఆ ముక్కలికి మోళ్ళని పేరు) తలపుకివచ్చాయి. ఆశ్చర్యపడ్డాడు. తను అంతవరకూ మనిషేనా అనుకొన్నాడు. “కాని వాటిపని ఇప్పుడు కాదు. మరొకసారి వేళ్లతో పెల్లగించి పారేస్తాను” అనుకున్నాడు.** అతను తిరిగి ఇంటికి వచ్చాడు. గంటెలజావ తనూ పెళ్లాము అర్ధాకలిగా తిన్నారు. వేటకి వెళ్లే అదనుగాకపోవడం చేత మాంసం లేదు. గంటెలచేను పండాలి, మళ్లా కడుపునిండా తినాలి. గంజితాగేక దొర గోచి తిన్నగా పెట్టుకున్నాడు. కోయవాడికి ఒంటిమీద ఉండే గుడ్డముక్క అదొక్కటే. కత్తి తీసుకొని అనుకున్న పనిమీద బయలుదేరాడు. గూడెం ముందర రోజాలోఉన్న తాటిమొక్కల కమ్మలు కొట్టేశాడు. ఎగువని ఉన్న ఊడుగుచెట్ల మెరుస్తూన్న ఆకుల కొమ్మలు రోజామీదికే వాలి ఉన్నాయి. ఆ కొమ్మలు నరికేశాడు. ఆపైని నల్లరేగికొమ్మలు రోజాని పైనుంచి కప్పుతున్నాయి. నాలుగు దెబ్బల్లో చెట్టునే నరికి అవతలపారేశాడు. చెట్లునరికే నేర్పు కోయవాళ్ళది. అందులో బొఱ్ఱన్నదొరది. ఎగువని రోజాలో చక్రాలగాళ్లు లోతుకిపోయి మధ్యని మనిషి కూచునేవలకి తగులుతూన్న దిమ్మ ఒక అర ఫర్లాంగు మేర వరకూ ఉంది. “దాని పని ఇప్పుడు కాదు. మొదట కొమ్మల పని.

అతగాడు ఎక్కడో అడవుల్లో పుట్టి పెరిగినవాడు! ఆదర్శాల గురించి ఆశయాల గురించి అనర్గళంగా ప్రసంగించడం సంగతి అటుంచి - కనీసం అలాంటి ఉపన్యాసాలు విని కూడా ఉండనివాడు. “ ఒట్టి మాటలు కట్టి పెట్టోయ్ - గట్టి మేల్ తలపెట్టవోయ్ ” అన్న మహాకవి సూక్తి అతనెన్నడూ చదువుకోలేదు. అయినా “ పూని ఏదైనాను ఒక మేల్ కూర్చి జనులకు చూప ” దానికి తలపెట్టాడు. గిరిజనుల బతుకుబాటలో గతుకులు పూడ్చడం అతగాడి 'మహాసంకల్పం'. అన్ని మహదాశయాల మాదిరే అది కూడా అసంపూర్ణంగానే మిగిలిపోయింది. అందుకే షష్టిపూర్తి చేసుకున్న ఈ కథని మీముందుంచుతున్నాం.



తర్వాత మోళ్ళపని. ఆ తర్వాత దిమ్మలపని. ఆ తర్వాత రాళ్ల ఏరెయ్యడం. అటు తర్వాత బండరాళ్ళపని. ఆ పైని ఊబి పని" అనుకున్నాడు దొర. కాని అంతట్లోనే అతని బుద్ధి మారిపోయింది. "అన్నీ చేసుకుంటూనే రాజవొమ్మంగిరోడ్డు జేరుకోవాలి" అని గభీమని నిర్ణయించుకున్నాడు. వెంటనే తాను బాగుచేసినంత మేరలో పడిఉన్న రాళ్ల ఏరెయ్యడానికి పూనుకున్నాడు. ఆరాళ్లు కంటికి కనపడగా బొర్రన్నదొర కడుపునిండా నవ్వుకున్నాడు. అసలే కోయవాని నవ్వు. అందులో బొర్రన్న దొరది సాటిలేని నవ్వు. కొంతసేపటికి చిరునవ్వుకి తగ్గింది. "ఈరాళ్ల మీదే కదా నా ఎడ్లు నడిచేవి. నా బండీ ఎగిరి కిందపడేది. **ఇన్నాళ్లూ ఎలా నడిపించాను అబ్బా!" అని దొర ఆశ్చర్యపడ్డాడు. అతను తనలో వనదేవత ప్రవేశించిందేమిటి చెప్మా అని ఎంతో ఆశ్చర్యపోయాడు. తర్వాత అతను ఆ రాళ్లను ఏం అడవిలో ఇటూ అటూ పారేశాడు. పెద్దకొండ అవతలికి సూర్యుడు చల్లగాజారాడు.** ఎక్కడో మైలు దూరాన్ని అడవిలో గాలి వీచడం బయలుదేరిన చప్పడయింది. గువ్వల జంటలు గూళ్లకి ఎగిరిపోతున్నాయి. బుడప విడిచి బండలు (కోతులు) చేల కోసం వెతుకుతున్నాయి. బొర్రన్న దొర గుడిసెకి బయలుదేరాడు. చేరుకున్నాడు. ఎవరినీ పలకరించలేదు. ఏదో ఇంత గంజితాగేడు. గంటెల చేనుని జీవాలు (జంతువులు) పాడి చెయ్యకుండా వడిసెల తోటీ, కత్తితోటీ చేను కావలాకి బయలుదేరాడు. వెన్నెట్లో గంటెల చేను నిశ్శబ్దంగా చల్లని మంచు తాగుతూంది. దొర అరప (మంచ) ఎక్కాడు. మధ్యమధ్య చప్పుడు చేస్తూన్న దుప్పుల్ని, కొండ గొర్రెల్ని, కణుసుల్ని, అడివి పందుల్ని, కుందేళ్ళనీ కేకలతోటీ, డబ్బారేకులతోటీ, వడిసెలతోటీ బెదరిస్తున్నాడు. ఆపని ఆపేటప్పటికి రోజా ఎలాగ బాగుచెయ్యాలి అనే దృష్టి. తెల్లవారుతూండగా దొరకి మంచి నిద్రపట్టింది. పొద్దెక్కి కాని లేవలేదు. వీధికి బయలుదేరాడు.

బొర్రన్న దొర కొన్ని రోజుల్లో దిమ్మని చెక్కేసి దాని అవతల ఉన్న ఊబిని బాగుచెయ్యడం మొదలెట్టాడు. ఆ ఊబిలో బండీ చక్రాలు కుంచం వరకు దిగబడిపోతున్నాయి. దొర కష్టపడి రాళ్ళు మోసి ఆ ఊబిలో పడేశాడు. దానిమీద ఇంత మట్టి పోశాడు. ఊబి కప్పడిపోయింది. ఆ స్థలం మీంచి బళ్ళు సాపుగా పోతుండగా అతను చూసి పట్టలేని ఆనందం పొంది గంగాదేవిని ధ్యానించాడు.

అసలే కోయదొర. అందులో ఇప్పుడు పనిమీద ఉన్నాడు. ఇంక అసలు మాట్లాడతాడా! మూగినోముపట్టేశాడు బొర్రన్నదొర. మునసబు లచ్చన్నదొర బొర్రన్న దొరని పలకరించాడు. బొర్రన్నదొర నోట్లోంచి ఏవో రెండు మాటలులాగి ఆర్తై (రెవిన్యూ ఇనస్పెక్టరు)గారు వస్తారంటూ మునసబు వెళ్లిపోయాడు. బొర్రన్న దొర దూడనివిప్పి ఆవుని పాలుపితికేడు. గిద్దెడు చుక్కలూ ఆర్తైగారి కోసం మునసబు ఇంటికి పంపాడు. దొర రోజుకి ఒకసారే పాలు పితుకుతాడు. అసలు అతని ముందుతరం వాళ్ళు ఆవుల్ని పాలు పితుకుతారని ఎరగరు. దూడల కోసమే ఆవుల్ని పెంచడం. ఇప్పుడు రవ్వంత తెలుగు మీరి వీధి అంతా పాలు పితుకుతున్నారని ముఠాదారు (కొన్ని గ్రామాల జమీదారు) గోలచేస్తున్నాడు. ఇంతకీ వీధి అంతా పాలు పితికితే రోజుకి రెండు శేర్లు అవవు. బొర్రన్నదొర ఆవు పాడిగల ఆవుల్లో ఒకటి. గిద్దెడు పాలు ఇస్తుంది. మరికొంతసేపటికి దొర వేలు విడిచిన చెల్లెలి కొడుకు ముర్రెందొర వచ్చాడు. గొడ్లని విప్పి అడివికి తోలుకుపోయాడు.

బొర్రన్నదొర పాదు (వెదురు బద్దలతో అరడగు ఎత్తుగాను, రెండడుగులు పొడుగుగాను, కట్టబడ్డ చట్రాలు ఒకదానికొకటి లంకెవేసి ఉంటాయి) పైకితీశాడు. గంటెలు పేరుకే ఉన్నాయి గుడిసెలో. పిట్టలేకపోతే మాడడమే. అంచేత పాదు పైకి తీసి ఉచ్చులికి ఆమదం రాశాడు. కత్తి, గునపం, పార ఒక చేత, రెండో చేతిత్తో చదలకోడి - షికారీపిట్ట (పంజరంలో ఉంచబడిన పిట్ట. ఇది అరవగానే ఇతర పిట్టలు వస్తాయి. అవి పాదులో చిక్కుకుంటాయి. ఈ పని కోసం తయారుచేయబడ్డ పిట్ట)- పంజరం, పాదు, పట్టుకుని బయలుదేరాడు. రొజామీద గునపం, పార విడిచిపెట్టి, కత్తి ఒకచేత, పంజరం, పాదు రెండో చేత్తో పట్టుకుని అడవిలోకి ఫర్లాంగుదూరం వెళ్లి ఎత్తుపల్లాలు లేని చోట పాదు అమర్చి గంటెలుచల్లి కైవారం మధ్యని షికారీపిట్ట పంజరం పెట్టి పది గజాల దూరంలో వెదురుపిడెం (వెదురుపొద) పక్కని దాక్కున్నాడు. మరికొంతసేపటికి షికారీపిట్ట కూత మొదలెట్టింది. అడవిచదలకోళ్ళు వచ్చాయి. పాదు మధ్యని వాలేయి, బొర్రన్నదొర నెమ్మదిగా చప్పట్లు కొట్టాడు. హూస్, హూస్ అన్నాడు. కోళ్ళు పరుగెత్తాయి. రెండు కోళ్ల మెడలు ఉచ్చుల్లో చిక్కుకున్నాయి. రెండు తప్పించుకుపోయాయి. చిక్కుకున్న కోళ్ల మెడలు నులిపేసి మంగలంలో పెట్టి వస్తువులు తీసుకొని రొజా దగ్గరికి వచ్చాడు. సాంయత్రం వరకూ దిమ్మపని పట్టించాడు. మట్టిదిమ్మ అయినా చిట్టంరాయిలాగా ఉంది. అంచేత యెంతో శ్రమపడ్డాడు. సాయంత్రం వరకూ ఒళ్లు హూనం చేసుకొని కొంత పనిచేశానుకదా అని పరమానందం పొంది, పనిచాలించి గూడానికి బయలుదేరాడు.

దొర పనిచేస్తూన్నప్పుడు పుల్లన్నదొర అడివిలోనే కలపకొడుతున్నాడు. బొర్రన్న దొర చేస్తూన్న పని అంతా అతను చూశాడు. ఆతను గూడెంలో అంతా చెప్పాడు. మునసబు బొర్రన్నదొర దగ్గరికి వచ్చాడు. "అన్నా! మనకెందు కా పని. సర్కారోళ్లు చేసుకుంటారు. ఎందుకా పని మనకి ఊరుకో" అన్నాడు. బొర్రన్నదొర "ఎద్దుకాలు విరిగింది" అని ఒక్క ముక్కల్లో సమాధానమిచ్చాడు. "నీకు తెలియదూ! ఎద్దుకాలంటావు! ఎన్నిసార్లు బళ్లు తిరగబడిపోలేదు! ఎన్నిసార్లు ఎడ్లు చావలేదు! ఎన్నిసార్లు చక్రాలు విరిగిపోలేదు! నీకు తెలియదూ! నీ ఎద్దంటావు!" అని ఆక్షేపణగా అన్నాడు. "మన తెలివి అలాగుంది. రొజా బాగుంటే" అన్నాడు దొర. "యుగ యుగాల నుంచీ లేంది ఇప్పుడు వచ్చిందా" అన్నాడు మునసబు. బొర్రన్నదొర తానుచేసిన పనిని గురించి ప్రశంసల కోసం తొందరపడుతున్నాడు. కాబట్టి "తమ్ముడూ! వీధిముంగల రొజా ఎలాగుంది" అన్నాడు "దానికేం. గచ్చు రోడ్డులాగుంది" అన్నాడు మునసబు. దొర ఉబ్బిపోయాడు ఆనందంతో. అసలే నోరు మూతపడిపోయింది. మరికొంతసేపు ఇద్దరూ ఫారెస్టు ఇలాఖా వాళ్ళని గురించి మాట్లాడుకొని ఎవరిదారిని వారు వెళ్లిపోయారు.

బొర్రన్న దొర కొన్ని రోజుల్లో దిమ్మని చెక్కేసి దాని అవతల ఉన్న ఊబిని బాగుచెయ్యడం మొదలెట్టాడు. ఆ ఊబిలో బండీ చక్రాలు కుంచం వరకు దిగబడిపోతున్నాయి. దొర కష్టపడి రాళ్ళు మోసి ఆ ఊబిలో పడేశాడు. దానిమీద ఇంత మట్టి పోశాడు. ఊబి కప్పడిపోయింది. ఆ స్థలం మీంచి బళ్ళు సాపుగాపోతుండగా అతను చూసి పట్టలేని ఆనందం పొంది గంగాదేవిని ధ్యానించాడు.

ఎగువని కొంతవరకు రొజా మధ్యని చెట్లమోళ్ళు ఉన్నాయి. ఈ మోళ్ళు ఒకొక్కప్పుడు ఎడ్లకాళ్ళకి తగులుతాయి. ఒక్కొక్కప్పుడు చక్రాలకి తగులుకొని నానా ఇబ్బందీ పెడతాయి. కొన్నాళ్ళపాటు బహు శ్రమపడి ఆ మోళ్ళని ఒకటి తర్వాత ఒకటిగా నేల మట్టం చేశాడు దొర.

గంటెలచేను పంటకి వచ్చింది. పందిళ్ళని, దడులని, పొదలని బీరకాయలు, పొట్ల కాయలు ఆనపకాయలు కాస్తున్నాయి. వాటి వాటి పండగలు చేసుకుంటేనేగాని అవి తినకూడదు. ఎన్ని పండితే ఏమిటి! ఒకనాటి సాయంత్రం దొరసాని "ఇంట్లో ఏ గుడ్డా లేదు" అంది. దొర మాట్లాడకుండా గజం (తుపాకీలో మందు దట్టించే ఇనప ఊస)తో తుపాకీలో మందు దట్టించి గుండు పడేసి చలకకి బయలుదేరాడు. తెల్లారేవరకూ చేను కావలాకాసి, చేను చుట్టూ పరిశీలించి అంతకి కాస్సేపు కిందటే దుప్పి నడిచిపోయినట్లు గడ్డిమీది మంచు బొట్లని చెదరగొట్టిన అడుగుల్ని చూసి, తెలుసుకొని, తుపాకీకి కేపు తగిలించి, అడుగుల జాడనే మచ్చ బొడపకివెళ్లాడు. ఏభై గజాల దూరంలో పాలమొక్క పక్కని ఒంటి దుప్పి (తన గుంపులో నుంచి తప్పిపోయి విడిగా తిరుగుతూన్న దుప్పి. ఇది మంచి ఉరువుగా ఉంటుంది. అలాగే ఒంటి కణుసు, ఒంటి పంది, ఒంటి గొరపోతు మొదలైనవి) మేస్తూంది. ఒళ్లు పరవశమయిపోయింది. కడుపునిండిపోయిందనుకున్నాడు. మీటు నొక్కాడు. దుప్పి కింద పడిపోడం కోసం చూశాడు. కాని, సన్న మందు (తుపాకీ గొట్టంలో మందుకీ కేపుకీ మధ్య నుండే మందు) నిలగాలింది (నెమ్మది నెమ్మదిగా కాలింది). మీటు చప్పుడికే దుప్పి ఉడాయించింది. తుపాకీ 'ఢాం' అంది, పక్షులు గోలచెయ్యడానికి మాత్రమే! దొర ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. ఎప్పుడూ ఎరగడు అలాగ తప్పిపోడం. "కోనలమ్మకి నామీద దయలేదు" అనుకున్నాడు. గుడిసెకి బయలుదేరాడు. వెల్లటి నుంచి మన్నెంలో మేపడానికి తోలుకొచ్చిన గొడ్లలో ఒకదాన్ని గూడెంలో సఫా చేశారు. బొర్రన్నదొర కడుపు కూడా నిండింది.

తను కొట్టేసిన దిమ్మకి ఎగువని రొజాకి అడ్డంగా కాలవ (వాగు) పారుతూంది. కాలవలో వెనక ఎప్పుడో రాళ్ల వేశారు, బళ్లు సుళువుగా వెళ్లడానికి., ఇప్పుడా రాళ్ళన్నీ ఇష్టం వచ్చినట్లు పడి ఉండి అవి లేకుండా ఉంటేనే బండి ఎంతో బాగా నడుస్తుందనిపిస్తున్నాయి. **దొర నాలుగు రోజుల పాటు శ్రమపడి ఆ రాళ్ళనన్నిటిని తవ్వి తీసి, పేర్చి దారి మళ్ళా చక్కగా చేశాడు. దాని మీంచి బళ్లు సుఖంగా వెళుతూంటే అతను బ్రహ్మానందపడ్డాడు.**

కాలవలోకి దిగేదారి అటుగాని ఇటుగాని ఏమీ బాగా లేదు. ఒకవైపు ఎంతో ఎత్తుగాను, రెండోవైపు ఎంతో పల్లంగాను ఉండి పైగా ఎంతో నిటారుగా ఉన్నాయి. బళ్లు బోల్తా కొట్టడమే తరువాయి. ఎత్తుగా ఉన్న వేపు తవ్వేసి ఏటవాలు ఎక్కువ చేశాడు. పల్లంగా ఉన్న వైపు రాళ్లపడేసి దారి సాపుచేశాడు. రొజాలోనే ఒకచోట ఒక పెద్ద బండరాయి నేలలోనుంచి పుట్టుకొస్తూంది. దానిపక్కనే చిన్న చిన్న రాళ్ళు అనేకం ఉన్నాయి. "అది రేపటి నుంచి మొదలెట్టవలసిన పని" అనుకున్నాడు దొర. మన్నాడు పొద్దున్న ఉలితోటీ, సుత్తితోటీ వెళ్ళి మొదట కొన్ని చిన్న రాళ్ళని సాపుచేశాడు. ఒక్క చిన్న రాళ్ళని సాపు చెయ్యడమే వారం రోజులు పట్టింది. ఆ తర్వాత పెద్దరాయిపని పట్టించాడు.

గూడెందొరలంతా అనుకున్నారు - బొర్రన్న దొరకి పిచ్చెత్తిందని. ముఠాదారు రొజాలో కొంత మార్పు చూసి కారణమేమిటని వాకబుచేసి, బొర్రన్నదొరకి పిచ్చెత్తిందని

తెలుసుకొని ఒక పిసరు విచారించి, "ఏదయితే యేం? మనుష్యుల్ని కొట్టకుండా ఇదీ మంచి ఉద్యోగమే. ఎవరికీ అపకారం లేనిపని ఏదో చేస్తున్నాడు. బాగానే కాలక్షేపం మవుతూంది" అన్నాడు. రొజామీద వాలిన కింది కొమ్మలూ బండీ గూళ్ళకి తగిలే పై కొమ్మలూ, తెగ్గొట్టి రొజా బాగుచేస్తున్నాడు బొర్రన్నదొర.

గూడెం చుట్టూ ఎంతో గాబు (చెత్తమొక్కలు వగైరా) ఉంది. గడ్డిమొక్కలూ, తుప్పలూ, పుట్టలూ నానాగాబుగానూ ఉంది. బొర్రన్న దొర ఈ మధ్య దాన్ని చూసి అనేకసార్లు పెదిమి విరిచాడు. దొర రొజా బాగుచెయ్యడం మొర్రెందొర చూశాడు. మొర్రెం దొర వయస్సు ఆట్టేలేదు; పదిహేనేళ్ళు. పెద్ద కళ్ళు, త్రికోణం ముక్కు, పెద్ద పెదిమెలు, జుంజురుజట్టు, పొట్టిగా మానులాగ ఉంటాడు. అతను దొరతో "మామా! గాబు సంగతేమిటి" అన్నాడు. దొర పెదిమి విరిచాడు. "నేనున్నాను" అన్నాడు మొర్రెందొర, గుండెల మీద చెయ్యికొడుతూ. తీరుబాటులేదన్నట్టు దొర ఊరుకుని బుర్ర తిప్పేశాడు. "అలాగా కాదు. మా గాటుజట్టు (కుర్రజట్టు) (గాటు= పన్నెండేళ్ళ కుర్రాడు) తయారవుతాం" అన్నాడు మొర్రెం దొర. **దొర మొహం ఇటువైపు తిప్పాడు. మొహాన్ని మందహాసం ఉదయించింది. "అయితే నువ్వక్కడ కూచుంటే చాలు, మా గాటుజట్టు పని చేసుకుపోతాం" అన్నాడు బుల్లిడి (పదిహేనేళ్ళ మొగాడు) ధీమాగా. దొర అప్రయత్నంగా బుర్ర ఆడించాడు. మొర్రెంరెడ్డి సంతోషంతో పరిగెట్టి కొన్ని గుడిసెల దగ్గరికి వెళ్లి కుర్రకారుని లాక్కొచ్చాడు. బొర్రన్న దొర తన మనస్సులో ఉన్న కోరిక ఫలిస్తూందని ఉబ్బిపోయాడు.** మన్నాటి నుంచి పనిచేస్తామని గాటుజట్టంతా దొరని ఒప్పించారు. వారం రోజుల్లో గూడెం చుట్టూ నూరుగజాలవరకూ పరిశుభ్రం చేసేశారు. మొర్రెందొర "ఇప్పుడు పాముల్నిగాని, దోమల్ని గాని, నక్కల్నిగాని రమ్మను" అన్నాడు. బొర్రన్నదొర తన కడుపు నిండిపోయినట్టు ఆ శుభ్రమైన స్థలాన్ని చూసి ఆనందంపట్టలేక అక్కడే చతికిలపడ్డాడు. కుర్రమూక అంతా అతని చుట్టూ చేరింది. అర్ధరాత్రిదాక బోలెడన్ని కబుర్లు చెప్పుకున్నారు.

కాస్త కష్టపడి దారి బాగుచేసుకోలేకపోయినా దారి బాగుపడితే మళ్ళా ఆదారినే వస్తారు. తెలివితక్కువ దద్దమ్మలు. కొంత శ్రమ పడితే ఎంత సౌఖ్యపడతారో ఎరగరు. తమ పనికానట్టూ, తమకి సంబంధం లేనట్టూ, తమ ఖర్మమే ఇంత అన్నట్టూ ఊరుకుంటారు.

బొర్రన్నదొర ఎప్పటి పనిమీద బయలుదేరాడు. వెంటకుక్క కూడా వస్తుంది. ఎడమవైపు రిజర్వు అడివి. కుడివైపు మామ్మూలు అడివి. రొజామధ్యని ఒక తెల్ల మద్దిమోడు ఉంది. దాని పెద్దవేళ్ళు నేలపైని ఉండి, రాళ్ళకంటే ఎక్కువ బాధపెడుతున్నాయి. మోడుచుట్టూ ఊరికేచూశాడు. చీమలపుట్టని రాత్రే బంటి(వెలుగుబంటి) బరికింది. ఈ మోడుని తెగ్గొట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇంతట్లో కుక్క జేజారెత్తిపోయి మొరిగింది. బొర్రన్నదొర వెనకా ముందూ చూశాడు. ఏమీ కనపడలేదు. రిజర్వు అడివి వైపు చూశాడు. పచ్చని ఆకుల గోడలోంచి కనపడేదేమిటి! అయినా పరిశీలించి చూశాడు. తనకిముందు అయిదుగజాల దూరంలో ఏదో జంతువు ఆకులు, కొమ్మలలో కలిసిపోయినట్టు కనబడింది. "మెకమా(పెద్దపులి) ఏమిటి!"అనుకుని పనిమానేసి నిలుచున్నాడు. మరికాస్త పరిశీలనగా చూశాడు; బండీచిందువు(చిరుతపులులలో ఒకరకం). " మెకంతో సమానమైనదే!"కుక్కని ఎత్తుకుని పోకుండా దగ్గరికి లాక్కుని బుజ్జగించి, గొడ్డలితోటీ, కేకలతోటీ చప్పుడు చేసి, బెదిరించి, బండీచిందువుని తోలేశాడు. మూడురోజులు తీసుకుంది, ఎండిపోయిన ఆ తెల్ల మద్దిమోడు నేలమట్టమవడానికి.

ఎగువని రొజాలో ఒకచోట ఒక నలభైగజాలమేర ఆరికెచేనులోంచి మరొకదారి తీశారు బళ్ళవాళ్లు. ఎంచేతంటే అంతకిమునుపు ఉన్న దారిలో ఒకవైపు బాగా గాడీ ఏర్పడిపోయి బండీతోలితే కుంచం నేలమీద రాసుకుంటోంది. అందుకని బళ్ళవాళ్లు మరొకదారితీసి మళ్లా కొంత ఎగువని రొజాలో కలిపేశారు. కొత్తదారి సుఖంలేదు. రాళ్ళు, డొంక(చిన్న చెట్లగుంపు), పుట్టలు. బొర్రన్న దొర నాలుగు రోజులు కష్టపడి అక్కడక్కడి రాళ్ళుతెచ్చి ఆగాడీ నింపి దానిమీద మట్టిపోసి చదునుగా తయారుచేశాడు. బళ్ళవాళ్ళు మళ్ళా ఈదారినే రాకపోకలు సాగించారు. వాళ్ళనిచూసి దొర పొట్ట చెక్కలయేటట్లా నవ్వుకున్నాడు. వీళ్ళు మనుష్యులేనా అని విస్తుపోయాడు. " కాస్త కష్టపడి దారి బాగుచేసుకోలేకపోయినా దారి బాగుపడితే మళ్ళా ఆదారినే వస్తారు. తెలివితక్కువ దద్దమ్మలు. కొంత శ్రమపడితే ఎంత సౌఖ్యపడతారో ఎరగరు. తమ పనికానట్టూ, తమకి సంబంధం లేనట్టూ, తమ ఖర్మమే ఇంత అన్నట్టూ ఊరుకుంటారు" అనుకున్నాడు దొర తన నూతనదృష్టిలో.

ఒకరోజు పొద్దున్న.మొర్రెందొర బొర్రన్న దొర ఇంటికివచ్చాడు. "మామా! నీకు సాయం చేద్దామంటే గొడ్లనికాచేవాళ్లెవళ్లూ! నువ్వు ఒంటరిగా తంటాలుపడుతూంటే నామనస్సెంతో బాధపడుతూంది. పెద్దోళ్ళకి చెప్తే వాళ్లకి తెలీదు.పైగా మనం చేసేదే తప్పని బోధపరచబోతారు. నాకేమీ తోచటంలేదు" అన్నాడు మొర్రెందొర. బొర్రన్న దొర ఆ విషయమై మాట్లాడలేదు; మొర్రెందొర సానుభూతే పదివేలని లోలోపల సంతోషించాడు. రాజవొమ్మంగి సంతలో వస్తువుల్ని గురించి కాస్సేపు ముచ్చటించాడు. దొర తనపనిమీద లేచాడు. మొర్రెందొర గొడ్లని విప్పడానికి పోయాడు.

రొజాని అంటిపెట్టకునే తాడిచెట్టొకటి ఉంది. ఇవతలవైపు బండరాయి, అవతల వైపు చెట్టు! ఈ ఇరుకులోంచి బళ్లు వచ్చేటప్పుడూ వెళ్లేటప్పుడూ అతి జాగ్రత్తగా నడిపిస్తేనే తప్ప ఇరుసు తాడిచెట్టుకి తగులుకుంటుంది. అక్కడి నుంచి నానా పీకులాట. బొర్రన్న దొర ఈ రోజున చెయ్యదలచుకొన్న పని తాడిచెట్టుని నేలమట్టం చెయ్యడం. క్రితం రాత్రే చిన్న జల్లుకొట్టింది. ఆ మాత్రానికే దోవంతా చిత్తడిగా ఉంది. చలిగాలి వీస్తూంది. పొద్దున్న సూర్యుడి ఎండలో చెట్ల తడి ఆకులు గాజుముక్కల్లా మెరుస్తున్నాయి. బొర్రన్నదొర చల్దిగంజితాగి కత్తి, గొడ్డలి పుచ్చుకుని పనిమీద బయలుదేరాడు. కుక్క కూడా వెంట వస్తూంది. దాన్ని తరిమేదుగాని పోలేదు. వెనక్కి తిరిగి తాను బాగు చేసిన దారి కనబడినంతవరకూ చూసి తల ఆడించి, గొడ్డలితో చెట్టుపని మొదలెట్టాడు. కొంతసేపు కొట్టాడు. ఎంచేతో ఎక్కువ అలసట అనిపించింది. కూచున్నాడు. కుక్కని దగ్గిరికి లాక్కుని కాస్సేపు దానితో ఆటలాడాడు. మళ్ళీ లేచాడు. గొడ్డలితో రెండు దెబ్బలు కొట్టాడు. చెట్టు పెళపెళమంది. చెట్టులో ఉడతలు చేసిన తొర్ర ఉందనే సంగతి దొరకి తెలియదు. ఇంకా ఎంతోసేపటికిగాని పడదనే తలంపుతో ఉన్న దొర నమ్మకం లేక అక్కడే నిలుచున్నాడు. చెట్టు తనవైపే పడుతూంది. కిందికి వచ్చేసింది. దొర చేతులు పైకెత్తాడు, మీద పడకుండా అడ్డినట్టు. చెట్టు మీద పడిపోయింది. దొర మాంసం ముద్దయిపోయాడు. కుక్క దగ్గరికి వచ్చింది. వాసన చూసింది. మళ్ళీ కొంచెం [illegible]ంలో కూచుంది. కొంతసేపు చూసింది. దొర లేవలేదు. దగ్గిరికి వచ్చి మళ్ళీ మళ్ళీ మూచూసింది. కెవ్వున కేకవేసి ఏడుపు మొదలెట్టింది. పుల్లల కోసం ఆ దారినే వెళుతూన్నలచ్చన్న దొర బొర్రన్న దొరని చూసి ఏడుస్తూ గూడేనికి వెళ్ళిపోయాడు. మరొక అరఘడియలో గూడెమంతా బొర్రన్న దొర శవం దగ్గిరే ఉంది. అంతా గోలపెట్టారు. "పిచ్చివాడు చచ్చిపోయా"డన్నారు పెద్దవాళ్ళు. "బొర్రన్నదొర దేవుడయాడు" అన్నారు కుర్రకారు. రకరకాల అడవి పువ్వులు, పత్రి గంపలతో తెచ్చి బొర్రన్నదొరని పూజచేసి ఆ స్థలంలోనే గొయ్యి తీసి దొరని సమాధిచేశారు. దానిమీద ఒక రాయి పడేశారు. బొర్రన్నదొర చేష్టలు చెప్పుకుంటూ అంతా గూడానికి బయలుదేరారు. కుక్క మాత్రం సమాధి దగ్గిరే ఉండి అరుస్తూంటే ఎవడో దొర దాన్ని చెవిపట్టుకుని లాగాడు. రాలేదు. మరొకడు "అదే వస్తుంది పోరా" అన్నాడు. కుక్క చెవి విడిచిపెట్టేశాడు. అది తిరిగి సమాధి దగ్గరికి వెళ్ళి ఏడవడం మొదలెట్టింది.

మొర్రెందొర కుర్రసజ్జుతో అన్నాడు "బొర్రన్న దేవుణ్ణి తలుచుకుంటే ఒంటిని మైకం కమ్ముతూంది" అని. మల్లిదొర "ఇంతవరకూ కోయకులంలో అటువంటివాడు పుట్టలేదు, మహాత్ముడు" అన్నాడు పరవశంతో. దొరకి పండగచెయ్యాలి అన్నాడు బాలుదొర ఉత్సాహంగా. "రొజా మాటేమిటి" అన్నాడు మొర్రెందొర గంభీరంగా. ఆపని దొరకిష్టమయినది. "మూడోవంతు మాత్రమే మిగిలింది" అన్నాడు సంకులమ్మ. మల్లిదొర కంట తడిపెట్టాడు. "దొర నాకు పని అప్పచెప్పాడు" అన్నాడు మొర్రెందొర గంభీరంగా. [illegible]వుడు! ఆయనకేం" అన్నాడు పొట్టి దొర భక్తితో. అప్పుడే పనిని వంతులు వేసుకున్నారు - గూడెంలో ఉన్న పద్దెనిమిది యువకులలోనూ సగం మంది మిగతాపనులన్నీ చెయ్యడానికీ, తక్కిన సగం మందీ రొజా మరమ్మత్తు చెయ్యడానికి.

కావలసిన సామాగ్రి అంతా పట్టుకొని మన్నాడే బయలుదేరారు. బొర్రన్నదొర సమాధి దగ్గిర మొక్కేరు. అతనికి పూజ చేశారు. "దొరకుక్కేది" అన్నాడు పొట్టి దొర. "రాత్రి ఏ చిందువో తినేసుంటుంది" అన్నాడు బాలుదొర. "ఆహా! ఏమి స్వామి భక్తి" అన్నాడు మల్లిదొర తన్మయత్వంతో. **కుక్కకి ఒక రాయి పాతేరు సమాధి దగ్గిర. రొజా అంతా బాగు చెయ్యడానికి రెండు నెల్లు పట్టింది. అంతముంది కలిస్తే రెండు నెల్లు పట్టింది. బొర్రన్న దొర ఒక్కడే రెండు వంతుల రొజా నాలుగునెలల్లో చేశాడు! ఎలాగచేశాడో అని యువకులు ఆశ్చర్యపోయి తన్మయులయ్యారు.**

జమాబందీకోసం డిప్టీకలెక్టరుగారు లాగరాయికి వస్తారని తెలిసింది. ఆయన క్రితం సంవత్సరం అనుభవం మీద ఏ బండీ అక్కర్లేదు, రొజా మీద నడిచేవస్తానని ముఠాదారుకి చెప్పాడు. ముఠాదారూ, మునసబూ కూడా "రొజాగచ్చు రోడ్డులాగుం"దని ఒకేసారి అన్నారు. డిప్టీ కలెక్టరుగారు చిరునవ్వునవ్వారు; అంతకంటే సమాధానం చెప్పలేదు. తీరా ఆయన బయలుదేరి లాగరాయికి వస్తూ రొజా స్థితి చూసి నిర్విణ్ణుడైపోయాడు. డిప్టీకలెక్టరుగారి బండీ బొర్రన్నదేవుడు ఉన్న చోట ఆగింది. ఆయన బండి దిగి ఆశ్చర్యపడ్డాడు. "లాగరాయి దొరలకి చాలా ఉపకారం చేశాడు దొర" అన్నాడు నెమ్మదిగా. "ఆయన దేవుడయాడండీ" అన్నాడు మునసబు భక్తితో. డిప్టీకలెక్టరుగారు చిరునవ్వుతో బండీ ఎక్కారు.